ఆధునిక వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి

రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం అధికారి మధుబాబు

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుబాబు

త్రిపురారం, మార్చి 5: ఆధునిక వ్యవసాయం వైపు రైతులు, శాస్త్రవేత్తలు అడుగులు వేయాలని రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం విస్తరణ సంచాలకుడు డాక్టర్ మధుబాబు అన్నారు. బుధవారం మండలంలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శాస్త్రీయ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం కంటే మెరుగ్గా రైతులకు అర్థమయ్యే రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏరువాక శాస్త్రవేత్తలు గత సంవత్సరం నిర్వహించిన పరిశోధనలను, వచ్చే సంవత్సరంలో చేయాల్సిన కార్యక్రమాలను ఆయన వివరించారు. వ్యవసాయం పరిశోధనా స్థానం పాలెం ఏడీఆర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు, శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, ఏరువాక కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, శాస్త్రవేత్త మధుశేఖర్, శాస్త్రీయ సలహా మండలి సభ్యులు సోమయ్య, బాలకృష్ణ, జ్యోతి, కవిత, భవానిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

దేవమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, మార్చి 5 : మండలంలోని తొండల్ వాయి గ్రామ మాజీ ఎంపీటీసీ చింత దేవమ్మ భర్త పెద్దయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బుధవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన దొంతూరి శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జువ్విగూడెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు యానాల అశోక్‌రెడ్డి, వడ్డె భూపాల్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, సత్తిరెడ్డి ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఏఎస్పీ మౌనిక

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

గుర్రంపోడ్, మార్చి 5: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదకరమని, డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీ హెడ్ నర్స్ శారదా కుమారి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ పసుపులేటి మధు, పిన్సిపాల్ జి.రాగిణి పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాలి

జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మార్చి 5 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని జడ్పీ సీఈఓ ఎన్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రైవేట్ బోర్లు అద్దెకు తీసుకోవాలన్నారు. వన నర్సరీల్లో మొక్కలకు రెండుసార్లు నీళ్లు అందించాలని, షేడ్‌నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీడీఓ బాలరాజుడ్డి, ఏపీఓ రాంచంద్రనాయక్ పాల్గొన్నారు.

రైతు భరోసా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ, మార్చి 5: రైతులకు రైతు భరోసా అందిం చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.5వేల చొప్పున ప్రతి రైతుకు అందించిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిస్థాయిలో విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.7500 చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు దాసరాజు జయరాజు, సిద్దం రాజు, నాయిని భాస్కర్, అంజిగౌడ్, గంగాధర్, ఉపేందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

'ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం'

మునుగోడు,మార్చి5 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ జానిమియా అన్నారు. మునుగోడు మండల పరిధిలోని పులిపలుపుల గ్రామంలో ఉపాధిహామీ కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట సంఘం నాయకులు బూట్లగారి ఎల్లయ్య, కొంపల్లి రాములు, పందుల యాదయ్య ఉన్నారు.

7న బోయగూడెంలో వైద్య శిబిరం

తిరుమలగిరి(సాగర్), మార్చి 5: ఈ నెల 7న మండలంలోని బోయగూడెం గ్రామంలో మేము సైతం మీ కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కట్టబోయిన శివకుమార్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకొందాం

- **ప్రజలు సోదరభావంతో మెలగాలి**
- **శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 5: పండుగలను ప్రజలందరూ కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, రంజాన్ మాసంలో అందరూ శాంతియుతంగా ఉండి సోదరభావంతో మెలగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి మాట్లాడారు. పండగ సందర్భంగా పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనుకోని సమయంలో విద్యుత్ సమస్యలు ఏర్పడితే పరిష్కరించడానికి క్విక్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణంతో పాటు ఆయా ప్రాంతాల్లోని మసీదులు, ప్రార్థనా స్థలాలు, రహదారులపై పరిశుభ్రత లోపించకుండా చూడాలని అన్నారు. బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని, రేషన్ షాపుల్లో బియ్యం సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా సున్నిత ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నామని, రాత్రిపూట నాకాబందీ నిర్వహిస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పుట్ పాత్ వ్యాపారాలు నిర్వహించుకోవచ్చన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ కుమార్, శాంతి కమిటీ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

నీట్ కేంద్రాలు గుర్తించాలి

నల్లగొండ : మే-4న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను గుర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఈ సారి 2800 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాసే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై నివేదిక అందించాలన్నారు. సమావేశంలో డీఆర్వో అశోక్‌రెడ్డి, నీట్ పరీక్ష నోడల్ అధికారి శ్రీనివాసులు,

డీఐఓ దస్రూనాయక్, డీఈఓ భిక్షపతి, డీఎస్పీ రమేశ్ పాల్గొన్నారు.

ఒల్డ్ సిటీలో మసీదు ముందే ఉన్న చెత్తకుప్ప

మసీదుల ముందే చెత్త కుప్పలు

నల్లగొండ, మార్చి 5: నల్లగొండ పట్టణంలోని పాత బస్తీలో ఉన్న మసీదు ముందు భాగంలో ఉన్న చెత్త కుప్పను మున్సిపల్ సిబ్బంది 15 రోజులుగా తీయకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రంజాన్ వేళ మసీదుల వద్ద పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని అధికారులు ఆదేశిస్తున్నా మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా దానిని శుభ్రం చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు : ఎస్ఐ

నల్లగొండ సిటీ, మార్చి 5 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి హెచ్చరించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు బుధవారం ఇసుక అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని పిలిచి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

రేషన్ బియ్యం దందాకు పాల్పడితే రైస్‌మిల్లు సీజ్ : డీటీ

మర్రిగూడ(నాంపల్లి), మార్చి 5 : రైస్ మిల్లుల యజమానులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి దందాకు పాల్పడితే మిల్లులను సీజ్ చేస్తామని పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. బుధవారం నాంపల్లిలోని రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కొన్ని రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యం నిల్వలు పట్టుబడినట్లు చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలి : డీపీఓ వెంకయ్య

నిడమనూరు, మార్చి 5 : గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని డీపీఓ కొండా వెంకయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నిడమనూరు గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బంది మైసయ్య, ఉదయ్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీఓ కేదర్‌నాథ్, పంచాయతీ కార్యదర్శులు మధుసూదన్, నర్సింహాచారి, సత్యనారాయణ, అశోక్, పావని, జానయ్య, మౌనిక పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఎం

చిట్యాల, మార్చి 5 : నీరులేక పంటలు ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో చిట్యాల, శివనేనిగూడెం గ్రామాల్లో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. పంట నష్టపాయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, నాయకులు జిట్ట సరోజ, బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, రాము లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా అందించాలి

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతిరావు

డైరీ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గుర్రంపోడ్, మార్చి 5: అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, ఆ తర్వాత ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో నేటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, అమ్మిన ధాన్యానికి బోనస్ డబ్బులు కూడా వారి ఖాతాలో జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పామనగుండ్ల వెంకన్న, నాయకులు నాగులవంచ నాగేశ్వర్‌రావు, కామల్ల రాములు, షేక్ సిరాజ్, మేకల వెంకట్‌రెడ్డి, ఎలుకొండ నగేశ్, మల్లోజు శ్రీనివాసాచారి, మనమాల మహేందర్, దోటి గణేశ్, కొండ్రపల్లి గిరి, పర్శనబోయిన వెంకన్న పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

సైబర్‌క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

నీలగిరి, మార్చి 5 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. సైబర్ జాగృతా దివస్ సందర్భంగా బుధవారం నల్లగొండ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఆలోచనతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. డిజిటల్ అరెస్టు, సైబర్ స్టాకింగ్, వర్క్‌ఫ్రం హోం పేరుతో మనల్ని ఆకర్షిస్తూ, కొన్ని సార్లు భయపెడుతూ మన డబ్బులు కాజేస్తున్నారని అన్నారు. ఎవరైనా డబ్బులు నష్టపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి కంప్లైట్ రిజిస్టర్ చేయాలని, ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్రాంపల్లిలో పోషన్ అభియాన్

గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిట్యాల, మార్చి 5 : మండలంలోని గుండ్రాంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహారం, రక్త హీనతపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పి.లక్ష్మి, బి.జంగమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

అరగంటలోనే మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

నీలగిరి, మార్చి5 : మహిళ కనిపించడం లేదని బాధితులు ఫిర్యాదు చేసిన అరగంట లోనే కనగల్ పోలీసులు ఆమె ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కనగల్ ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం జి.చెన్నారం గ్రామానికి చెందిన కాలం నాగజ్యోతి, నాగరాజు భార్యాభర్తలు. కొంత కాలంగా కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. దాంతో జీవితంపై విరక్తి చెందిన నాగజ్యోతి మంగళవారం మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లల్ని తీసుకొని ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం భర్తతో పాటు జ్యోతి తల్లిదండ్రులు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో కనగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి దర్యాప్తు చేస్తున్న క్రమంలో జ్యోతి తన అన్న మొబైల్‌కు ఫోన్ చేసి తాను జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన గురించి వెతకవద్దని చెప్పింది. దాంతో పోలీసులు సదరు ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి నాగ జ్యోతి హైదరాబాద్‌లో ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం హయత్‌నగర్ పోలీసుల సహకారంతో కేవలం అరగంటలోనే నాగజ్యోతి ఆచూకీని కనుగొన్నారు. హయాత్‌నగర్ పోలీసుల సమక్షంలో ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతి వేగంగా స్పందించి మహిళను కాపాడిన ఎస్ఐ విష్ణుమూర్తి, పోలీసులను గ్రామస్తులు అభినందించారు.

హాస్టళ్లలో మెనూ పాటించాలి

గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

పెద్దవూర, మార్చి 5 : మెనూ ప్రకారం హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ ఆదేశించారు. బుధవారం మండలంలోని సమీకృత బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వంట గదిని, వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వంట గదిని, ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అధికారులు, వసతి గృహం సిబ్బంది ఉన్నారు.

రామగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

నల్లగొండ మండలం నర్సింగ్‌భట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

స్వపరిపాలన దినోత్సవం

నల్లగొండ, మార్చి5: జిల్లా కేంద్రంలోని రామగిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 14మంది విద్యార్థినులకు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సింగం లక్ష్మి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రఘుపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, నాగమ్మ, రేణుక, రాజశ్రీ,అలివేలు, లత, ఉమారాణి, ఇందిర పాల్గొన్నారు.

నియోజకవర్గానికో మోడల్ పీహెచ్‌సీ

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ సిటీ, మార్చి 5 : రాబోయే రెండు నెలల్లో జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున మోడల్ పీహెచ్‌సీలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కనగల్ పీహెచ్‌సీలో రాష్ట్రంలోనే మొదటి సారి గ్లూకోమా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వేసవి కాలంలో మెడికల్ క్యాంపులు నిర్వహించే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, పదో తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత అన్ని పాఠశాలల్లో, హాస్టళ్లలో మరమ్మలు చేపడతామని, కనగల్, తిప్పర్తి మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయని వచ్చే విద్యాసంవత్సరం నుంచి అద్దె భవనాల్లోనైనా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ సువర్ణామహేంద్ర, టీటీఐడీసీ ఈఈ జైపాల్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివం కర్‌రెడ్డి, కనగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిరేకల్ పట్టణ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వీరేశం

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మార్చి 5 : నకిరేకల్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 5, 8,9 వార్డుల్లో రూ.60 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న పీఈటీకి వేతనంగా రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రజితాశ్రీనివాస్, కమిషనర్ బాలయ్య, పీఆర్ డీఈఈ కొండయ్య, ఏఈ సంపత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నాకు తెలియకుండా ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు ఎలా పోశారు?

అధికారులపై ఎమ్మెల్యే సామేల్ ఆగ్రహం

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, మార్చి 5 : తనకు సమాచారం ఇవ్వకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు ఎలా పోశారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని తుడిమిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఈ నెల 4న అధికారులు ముగ్గు పోసిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఈ విషయమై అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున సమాచారం ఇవ్వలేక పోయామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముగ్గు పోశామని ఎంపీడీఓ జ్యోతి లక్ష్మి వివరించారు. సమావేశంలో తాసీల్దార్ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌ర